క్లుప్తంగా

ముమ్మరంగా ఆకుపోతలు

మాడుగుల: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేశారు. వర్షాలు కురవడం వల్ల పక్షం రోజుల వ్యవధిలో వరినారు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షాలకు పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, జలాశయాల్లో నీటిమట్టం కొంత మేర ఆశాజనకంగా ఉంది. వరివిత్తనాలు చల్లుతున్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధికి కృషి

ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పలరాజు బాధ్యతల స్వీకరణ



దేవరాపల్లి: మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకుల సహాయ సహకారాలతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అప్పలరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 10,342 మంది పింఛన్‌దారులకు రూ.6.73 లక్షల మేర సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని దేవరాపల్లి, ముషిడిపల్లి, కె.ఎం.పాలెం, ఎ. కొత్తపల్లిలో మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్‌తో కలిసి పర్యవేక్షించామన్నారు.

డాక్టర్ రాజశేఖర్‌కు సన్మానం



డాక్టర్ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: డాక్టర్స్ డేను పురస్కరించుకుని వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రజలకు వైద్య సేవలందిస్తున్న పలువురు వైద్యులను సోమవారం సన్మానించారు. పట్టణంలో ప్రముఖ వైద్యుడు పి.రాజశేఖర్‌ను వాకర్స్ క్లబ్ సభ్యులు స్వయంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు అడిగర్ల వరహాలనాయుడు, అల్లు అప్పారావు, కుప్పిలి మురళీ, నర్సింహమూర్తి, ప్రసాద్, పిట్టా శ్రీనువాసరావు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాంబ ఆలయ వార్షికోత్సవం



దుర్గామాంబను దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: ములకలాపల్లిలో ఆధ్యాత్మిక, భజన కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి సంతరించుకుంది. సోమవారం ఇక్కడ దుర్గామాంబ ఆలయ 7వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ పురోహితుడు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

4న నీట్ స్కామ్‌పై విద్యా సంస్థల బంద్

తుమ్మపాల: దేశంలో నీట్ పరీక్షను రద్దు చేసి, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ పిలుపునిచ్చారు. నీట్ నిర్వహణలో భారీ స్కాం జరిగిందని, బీహార్‌లో పోలీసులు పట్టుకున్న కొంత మంది పేపర్‌ని రూ.30 లక్షలకు విక్రయించినట్లు సీబీఐ వద్ద అంగీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రపంచ యుద్ధాలనే ఆపగలిగే సత్తా ఉందని చెప్పుకునే మోదీ 23 లక్షల మంది వైద్య విద్యార్థుల జీవితాలను ఆందోళనలోకి నెట్టిన నీట్ పరీక్ష స్కాంను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. డిమాండ్ల సాధన కోసం జూలై 4న చేపడుతున్న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు విద్యా సంస్థలు, ప్రభుత్వం స్వచ్ఛందంగా మద్దతు తెలపాలని కోరారు. జిల్లా నాయకులు బాబ్జీ, రమణ, కమిటీ సభ్యులు రాజేష్, శ్రీహరి పాల్గొన్నారు.

తొలి రోజే పింఛన్‌దారులకు పాట్లు

- సజావుగా సాగని పింఛన్ల పంపిణీ
- పలుచోట్ల సర్వర్లు పనిచేయక అవస్థలు
- ఉదయం నుంచే లబ్ధిదారుల పడిగాపులు
- గంటలకొద్దీ అవ్వాతాతలకు తప్పని నిరీక్షణ

అష్టకష్టాలు పడి తొలిరోజు పింఛన్ల పంపిణీ కానిచ్చేశారు. కొన్ని గ్రామాల్లో ఇంటికెళ్లి ఇవ్వగా, మరికొన్ని గ్రామాల్లో చెట్టు నీడకు, ప్రభుత్వ కార్యాలయాల వద్దకు రప్పించి ఇచ్చారు. పలు చోట్ల సర్వర్లు మొరాయించడంతో అవస్థలు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మాదిరిగా తెల్లవారుజామున ఇంటి తలుపు తట్టి పింఛన్లు ఇస్తారనుకుని గంటలకొద్దీ ఎదురు చూసిన అవ్వాతాతలకు నిరాశ తప్పలేదు. వెరసి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు ఫొటోలకు పోజులిచ్చేందుకు పోటీపడగా, సచివాలయ సిబ్బంది, అధికారులు నానా అవస్థలు పడి ఈ కార్యక్రమం చేపట్టారు.



మాడుగుల రూరల్: బిల్లలపాలెం గిరిజన గ్రామంలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ పరిధి ఇప్పగరువు, పూలగరువు ప్రజలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా గ్రామ కూడలి వద్ద పడిగాపులు కాసి అవస్థలు పడ్డారు. ఇంటింటికీ పంపిణీ చేయాల్సి ఉండగా మండలంలోని చాలా గ్రామాల్లో ప్రధాన కూడలి వద్దకు రప్పించారు. వాలాబు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో రామాలయం, కమ్యూనిటీ హాళ్లు, గ్రామాల కూడళ్ల వద్ద ఇచ్చారు. దేవరాపల్లిలో సైతం పలు వీధుల్లో ఒకే చోట కూర్చుని పింఛన్లు పంపిణీ చేపట్టారు. సర్వర్ మొరాయించడంతో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు మాత్రం సర్వర్ పని చేయకపోయినప్పటికీ అవ్వాతాతలకు పింఛన్లు అందించినట్లు ఫొటోలకు పోజులిచ్చి హడావిడి చేశారు. గతంలో గడప దాటకుండా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందించే వారని, ప్రస్తుతం ఎప్పుడు ఇస్తారో, ఎక్కడ ఇస్తారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.



చీడికాడ: బి.సింగవరం కూడలి వద్ద పింఛన్లు అందిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: నూతన ప్రభుత్వంలో గ్రామ సచివాలయ సిబ్బంది సోమవారం ఉదయం 8 గంటల నుంచి పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. అన్ని చోట్ల సర్వర్ పనిచేయకపోవడంతో పింఛనుదార్లు ఇబ్బందులు పడ్డారు. 9.30 గంటల తర్వాత సర్వర్ పని చేయడంతో పింఛను పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. గిరిజన గ్రామాల్లో సాంకేతికపరమైన సమస్యలు ఉన్నా సరే మధ్యాహ్నం పింఛన్లు పంపిణీ జరిగింది. గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు ప్రతి లబ్ధిదారు వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేశారు. తొలి రోజు మండలంలో 88.21 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదరావు తెలిపారు. సోమవారం సాయంత్రం 5.10 గంటల వరకు మండలంలో 10,918 మందికి పింఛనుదారులకు గాను, 10,522 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేశామన్నారు. మిగిలిన వారికి మంగళవారం అందజేస్తామని తెలిపారు.



కె.కోటపాడు: ఎ.కోడూరులో పెన్షన్ నగదు అందిస్తున్న సచివాలయ ఉద్యోగి, నాయకులు

చీడికాడ: మండలంలోని 23 పంచాయతీల్లో సోమవారం సాయంత్రం వరకు 94 శాతం మేర పింఛన్లు పంపిణీని పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలో సామాజిక పింఛన్లు 9,256 ఉండగా, అందులో 94 శాతం సచివాలయాల సిబ్బందితో తొలి రోజు అందించామన్నారు. ఇదిలా ఉంటే పలు గ్రామాల్లో సర్వర్లు పని చేయకపోవడంతో గ్రామ కూడళ్ల వద్ద పింఛన్లు అందించారు.

బుచ్చెయ్యపేట: పింఛన్‌దారుల కష్టాలు మరలా మొదలయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో చెట్లు కింద, అరుగుల మీద ఏ అధికారి ఎప్పుడొచ్చి పింఛన్ ఇచ్చేవారో తెలిసేది కాదు. ఆ తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లతో మొదటి తేదీన తెల్లవారుజాము 6 గంటలకే పింఛన్లు అందేవి. తాజాగా కూటమి ప్రభుత్వంలో పాత కష్టాలు మొదలయ్యాయని లబ్ధిదారులు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ఉదయం నుంచి ఇంటింటికీ అందించగా, టీడీపీ నాయకులు వారిని బెదిరించి తాము వచ్చే వరకు ఇవ్వొద్దంటూ హుకుం జారీ చేశారు. అనంతరం పార్టీ నాయకులు వచ్చాక ఆలయాలు, స్టేజీల వద్దకు రప్పించి ఇవ్వడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. పెదమదీన, ఎల్బీపురం, మంగళాపురం, మల్లాం తదితర గ్రామాల్లో సర్వర్లు పనిచేయక గంటల కొద్దీ నిరీక్షించారు. గున్నెంపూడిలో అంగన్‌వాడీ కార్యకర్తలు పింఛన్లు పంపిణీ చేయడంతో పిల్లల ఆలనాపాలనా ఎవరూ చూస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. బుచ్చెయ్యపేట మండలంలో 10,792 పింఛన్లకు గాను తొలిరోజు 75 శాతం నగదు అందించినట్లు ఎంపీడీవో వెంకటాచార్య తెలిపారు.



మాకవరపాలెం: గిడుతూరులో నగదు కోసం ఒకేచోటికి వచ్చిన పింఛనుదారులు

కె.కోటపాడు: కె.కోటపాడు మండలంలో 32 గ్రామ పంచాయతీల్లో సోమవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయల సిబ్బందితోపాటు వివిధ శాఖల అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. పలు చోట్ల సర్వర్‌లు మొరాయించడంతో పింఛన్‌దారులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గొట్లాంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎ.కోడూరులో మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు పింఛన్ పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 11,001 మందికిగాను 7 కోట్ల 10 లక్షల 21 వేల రూపాయలు పంపిణీ చేస్తున్నామని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు.



నాతవరం: లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

86 శాతం పింఛన్ల పంపిణీ

గొలుగొండ: మండలంలో 86 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో రత్నకుమారి సోమవారం తెలిపారు. మండలంలో సామాజిక పింఛన్లు 8,713 ఉండగా, 7,558 వరకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉదయం రెండు గంటల పాటు సర్వర్ పనిచేయకపోవడం వల్ల ఇబ్బందులు వచ్చాయన్నారు. మిగతా పంపిణీ కార్యక్రమం మంగళవారం పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

నాతవరం: మండలంలో 11,325 పింఛన్లకుగాను మొదట రోజు 95 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో జాగరల రాంబాబు, తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ సోమవారం తెలిపారు. మొదట్లో వర్షంతో పాటు నెట్ సిగ్నల్స్ సమస్య కారణంగా ఇబ్బందులు పడ్డామన్నారు. తర్వాత పింఛన్లు పంపిణీ చేశామన్నారు. వీటిలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం ఇంటింటికీ వెళ్లి మిగిలిన పింఛన్లు ఇస్తామన్నారు.

మాకవరపాలెం: మండలంలో పింఛన్ల నగదును టీడీపీ నేతలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం నుంచే పంపిణీ ప్రారంభించారు. చాలాచోట్ల సర్వర్ పనిచేయక లబ్ధిదారులకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. మండల వ్యాప్తంగా 15 సచివాలయాల పరిధిలో 10,261 మంది లబ్ధిదారులకుగాను సాయంత్రం 6 గంటల వరకు 9,190 మందికి నగదు పంపిణీ చేశారు. గిడుతూరులోని ఒక వీధిలో లబ్ధిదారులంతా ఒకే చోటికి వచ్చి నగదును తీసుకున్నారు. పింఛన్ల పంపిణీలో తహసీల్దార్ మురళీమోహన్‌రావు, ఎంపీడీవో చంద్రరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. డయేరియా, మలేరియా వ్యాధులపై వైద్య ఆరోగ్య సిబ్బంది చేపట్టిన అవగాహన ర్యాలీని సోమవారం ఆయన ప్రారంభించారు. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. గ్రామాల్లో శానిటేషన్ మెరుగుపరచడంతోపాటు పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలని, ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం డయేరియాను నిర్మూలించేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టిందన్నారు. చిన్నపిల్లలు డయేరియా వ్యాధి బారినపడుతున్నారన్నారు. ఈ ప్రోగ్రాం రెండు నెలల పాటు కొనసాగుతుందన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి, వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు అందజేస్తామన్నారు. వీటిని ముందుగా పిల్లలకు ఇవ్వటం ద్వారా డయేరియా బారినపడరన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డాక్టర్ చాందని దివ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డయేరియా అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో జయరాం

ప్రతి పంచాయతీని అభివృద్ధి చేస్తా:ఎమ్మెల్యే రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట: ప్రతి పంచాయతీని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని టీడీపీ చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు గండి సింహాద్రి ఆధ్వర్యంలో కుసుర్లపూడిలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఏ పార్టీకీ ఇవ్వని మెజార్టీతో తనను గెలిపించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామాభివృద్ధి కోసం సమష్టిగా పని చేయాలని సూచించారు. అనంతరం జె.పి.అగ్రహారం, జానకీరాంపురం, కుసర్లపూడి, రోలుగుంట, కొవ్వూరు తదితర గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు తాతాజీ, సబ్బవరపు పెద్దినాయుడు, మాజీ ఎంపీటీసీ గొల్లు రమణ పాల్గొన్నారు.

వాగ్దానాలు విస్మరిస్తే శాంతియుత పోరాటం

నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్



నర్సీపట్నం: వాగ్దానాలు అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరపున శాంతియుత పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అన్నా క్యాంటీన్లు ఎన్నికల దగ్గర చేసి పెట్టడం కాకుండా ఐదేళ్లు కొనసాగించాలన్నారు. 2014లో ఎన్నికల్లో వాగ్దానం చేసి చంద్రబాబు ఎన్నికలకు ఆర్నెల్లకు ముందు అందుబాటులోకి తీసుకువచ్చారని విమర్శించారు. 2019 ఎన్నికల తర్వాత అల్లిపూడి వెళ్లిపోయిన టీడీపీ నాయకులు 2024 ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆర్నెల్ల ముందు అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లికి వందనం పథకం కోసం నియోజకవర్గంలోని 34 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 10 వేల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. ఖరీఫ్ పెట్టుబడులకు 45 వేల మంది రైతులకు రూ.20 వేల చొప్పున అన్నదాత సుఖీభవ సొమ్ము చెల్లించాలన్నారు. 19 నుంచి 50 ఏళ్ల నిండిన 90 వేల మంది మహిళలకు రూ.1500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. వారంతా దాని కోసం ఎదురు చూస్తున్నారన్నారు. 85 వేల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలన్నారు. 50 ఏళ్ల నిండిన వారు 21 వేల మంది ఉన్నారన్నారు. ఉచిత బస్సు సౌకర్యం వీలైనంత త్వరగా కల్పించాలన్నారు. వీరందరికీ పింఛన్ సొమ్ము మంజూరు చేయాలన్నారు. వీటి అమలులో నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు తరపున శాంతియుతంగా పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు.

జోగన్నపాలెం పాల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు

కె.కోటపాడు: కింతాడ పంచాయతీ జోగన్నపాలెం పాల సంఘం అధ్యక్షుడిగా బండారు అప్పలనాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక పాల సంఘం ఆవరణలో రెండు డైరెక్టర్ల పదవులకు ఎన్నిక నిర్వహించారు. ఈ రెండు స్థానాలకు బండారు అప్పలనాయుడు, కూండ్రపు నర్సింహమూర్తి ఎన్నికయ్యారు. వీరిద్దరితోపాటు మిగిలిన డైరెక్టర్లు కుభిరెడ్డి అర్జున, చింతు అన్నంనాయుడు, కుభిరెడ్డి ఈశ్వరమ్మ, బండారు రమణమ్మ, రెడ్డి నరసయ్య, బండారు స్వామినాయుడు, బండారు రమణ, బండారు దేముళ్లు సంఘ అధ్యక్షుడిగా అప్పలనాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.



అప్పలనాయుడును అభినందిస్తున్న రైతులు, గ్రామస్తులు

నూతన అధ్యక్షుడిని సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు, వేతన కార్యదర్శి బండారు గంగునాయుడు, కన్నూరు అప్పలనాయుడు, మాజీ అధ్యక్షుడు పోలినాయుడు దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికతో అభినందించారు.

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నేత జీవీ రావు

అనకాపల్లి: అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు గత ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ప్రతిపాదించిన సిఫార్సులను అమలుచేసి, ఉద్యోగుల్ని ఆదుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నేత బీవీ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కోడిగంటి గోవిందరావు భవన్‌లో యూనియన్ నూతన జిల్లా అధ్యక్షుడు ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ ద్వైవార్షిక సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు రూ.5 లక్షల గ్రాట్యుటీ, రూ.5 లక్షల వరకు కుటుంబ సభ్యులకు వైద్య బీమా, రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్న కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల మాదిరే గ్రామీణ తపాల ఉద్యోగులకు వేతన సవరణ జరపాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అత్యధిక సభ్యత్వం, గుర్తింపు పొందిన యూనియన్ అనేక పోరాటాలు నిర్వహిస్తూనే ఉందన్నారు. దాని ఫలితంగానే కొద్దిపాటైనా గ్రామీణ తపాలా ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అంతకు ముందు జరిగిన యూనియన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సతీష్‌కుమార్, కార్యదర్శిగా వి.దుర్గాప్రకాష్, కోశాధికారిగా పి.నూకరాజు దొర, ముగ్గురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, కోశాధికారి, సహాయ కోశాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వైఎస్ భద్రం, మండల అధ్యక్షులు శ్రీరామదాసు అబ్బులు. కార్యదర్శి, వి.దుర్గాప్రసాద్, యూనియన్ నాయకులు గంగరాజు, కోన లక్ష్మణ పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న యూనియన్ జాతీయ నేత జీవీ రావు

ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరావుకు సీఐగా పదోన్నతి

తుమ్మపాల: పట్టణంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నర్సింగరావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందినట్లు సోమవారం డీఐజీ విశాఖపట్నం రేంజ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఎస్ఐ నుంచి సీఐగా పదోన్నత ప్యానల్‌లో నర్సింగరావు పేరు రోస్టర్ పాయింట్‌లో ఉంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.రోహిణిపతి జూన్ 30న పదవీ విరమణ కారణంగా ప్రస్తుతం ఖాళీలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ప్రస్తుతం విధుల్లో ఉన్న పోస్టు నుంచి రిలీవ్ చేయాల్సిందిగా జిల్లా ఎస్పీని కోరారు. 15 రోజుల్లో ప్రమోషన్ ఆర్డర్‌తో విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

అతిసారపై అవగాహన ర్యాలీ



బుచ్చెయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



రోలుగుంటలో పీహెచ్‌సీ సిబ్బందితో కలసి ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి శ్రావణి



గొండుపాలెంలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి నిర్మల

బుచ్చెయ్యపేట: అతిసారపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీని సోమవారం బుచ్చెయ్యపేటలో నిర్వహించారు. ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నాల్గు రోడ్ల జంక్షన్ వరకు ఈ ర్యాలీ సాగింది. వర్షాకాలంలో వ్యాపించే అతిసారపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఎవరైనా వాంతులు, విరేచనాలతో బాధపడితే స్థానిక వైద్య సిబ్బందిని ఆశ్రయించి తగిన సేవలు పొందాలని వైద్యుడు వెంకటకృష్ణ సూచించారు. కలుషిత నీరు, ఆహారం తినడం వల్ల అతిసార వస్తోందన్నారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు వయస్సు పిల్లల ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో వీటిని అందుబాటులో ఉంచామని తెలిపారు. వైద్య సిబ్బంది దేముడు, త్రిమూర్తులు, కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

కె.కోటపాడు: ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు అతిసార బారిన పడకుండా ఉండేందుకు కనీస జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. సోమవారం గొండుపాలెంలో అతిసార నియంత్రణపై గ్రామస్తులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిసార నియంత్రణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. ముఖ్యంగా ఐదేళ్లలోపు చిన్నారులు వ్యాధి బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. చేతులను శుభ్రపర్చుకోవడంతోపాటు కాచి చల్లార్చిన తాగునీటిని తాగాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంతోపాటు ఆరుబయట మలవిసర్జన చేయొద్దన్నారు. నిల్వ ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, బండారు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు ఆర్ మహాలక్ష్మి, కే మహాలక్ష్మి, డీఈవో మనీషా, రమణ పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలసి వైద్యాధికారి శ్రావణి అతిసార నియంత్రణపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలుషిత నీటిపై జాగ్రత్తలు తీసుకోవాలి, కాచిన నీటిని తాగాలని, విటమిన్ ×ఎ౯ సిరప్ తాగించాలని, పిల్లలకు తల్లిపాలే తాగించాలని నినాదాలు చేశారు. ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను వాడాలని, మితంగానే శాకాహారం తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. ఆకు, కాయగూరలే వాడి ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎంపీహెచ్ఈవో కృష్ణ, పీహెచ్ఎన్ సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ షాజహాన్, ఎంఎల్‌పీహెచ్ వరహాలమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం

తుమ్మపాల: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 43 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. విజయనగరం క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో 2,425 యూనిట్ల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 84 క్లబ్స్ రక్తదానం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లబ్ ప్రెసిడెంట్ రాజేష్ కుమార్, సెక్రెటరీ అనిల్, కోశాధికారి సత్యేంద్ర, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

తగ్గిన టమాటా ధర

కశింకోట: తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తగ్గి కాస్త ఊరట కలిగించింది. కిలోకి రూ.20 తగ్గింది. గత వారం కిలో రూ.80 ఉండగా, ఈ వారం రూ.60కి విక్రయాలు సాగాయి. ఇక ఉల్లిపాయ, బంగాళాదుంప రూ.40 వద్ద బెట్టు మీదే ఉంది. దొండకాయ మినహా మిగిలిన కూరగాయల ధరలు ప్రియంగానే ఉన్నాయి. దొండకాయ రూ.30, బెండకాయ, వంకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.50, బీరకాయ రూ.60, బరబాటి రూ.80, పచ్చిమిర్చి రూ.120, అల్లం రూ.220కు విక్రయాలు సాగాయి.

ఉపాధ్యాయులు బోధన మెరుగుపర్చుకోవాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: ఉపాధ్యాయులు బోధన శక్తిని మెరుగుపర్చుకోవాలని ఎంఈవో సిహెచ్.తలుపులు సూచించారు. బోధన మెరుగు కోసం ఉపాధ్యాయులకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బోధనకు సంబంధించి విద్యా శాఖ రూపొందించిన 28 అంశాలపై ఉపాధ్యాయులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణలో పొందిన అనుభవం ద్వారా విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. ఎంఈవో -2 నాగేంద్ర, కోర్సు డైరెక్టర్ కిట్టు పలు అంశాలను వివరించారు.